# ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- చెన్నూర్ నియోజకవర్గంలో 227 పోలింగ్ కేంద్రాలు
- సామగ్రితో చేరుకున్న సిబ్బంది



కిష్టంపేట డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో పాల్గొన్న ఎన్నికల సిబ్బంది

చెన్నూర్, నవంబర్ 29: చెన్నూర్ నియోజకవర్గంలో శాసన సభ ఎన్నికల నిర్వహణకు అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. పట్టణ సమీపంలోని కిష్టంపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది బుధవారం ఉదయమే హాజరయ్యారు. ఈ ఎన్నికల సామగ్రి కేంద్రాన్ని కలెక్టర్ బదావత్ సంతోష్, రామగుండం సీపీ రేమా రాజేశ్వరి, డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ పరిశీలించారు. నియోజకవర్గంలో మొత్తం 1,88,283మంది ఓటర్లున్నారు. 227పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 28జోన్లగా విభజించి 28మంది జోనల్ అధికారులను నియమించారు. 227మంది ప్రిసైడింగ్ అధికారులను, 227మంది అసిస్టెంటు ప్రిసైడింగ్ అధికారులను, 454మంది పోలింగ్ క్లర్క్‌లను నియమించారు. 54మంది సూక్ష్మ పరిశీలకులను, 132మంది వెబ్ కాస్టింగ్ సిబ్బందిని నియమించారు. వీరంతా ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పంపిణీ కేంద్రాల నుంచి పోలింగ్ కేంద్రాలకు సామగ్రితో సిబ్బంది వెళ్లేందుకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ రోజున ఎలాంటి సంఘటనలు జరుగకుండా బందోబస్తు కోసం పోలీసు సిబ్బందిని నియమించారు. వీరితో పాటు మెబైల్ పోలీసు పార్టీలు కూడా గస్తీ తిరుగనున్నాయి. పోలింగ్ సిబ్బంది కోసం పంపిణీ కేంద్ర వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయగా, జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు పరిశీలించారు.

**కోటపల్లి మండలంలో..**

కోటపల్లి, నవంబర్ 29 : కోటపల్లి మండలంలో మొత్తం 33 బూత్‌లు ఉండగా మొత్తం 25735 మంది ఓటర్లున్నారు. కోటపల్లి మండలం మహారాష్ట్రకు సరిహద్దుగా ఉండగా ఎన్నికలను ప్రశాంత



పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సంతోష్ బదావత్, సుధీర్ రాంనాథ్ కేకన్

వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్‌లు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలతో నిఘాతో డ్రోన్‌తో పహారా కాస్తున్నారు. సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ, సివిల్ పోలీస్‌లతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. కోటపల్లిలోని పోలింగ్ బూత్‌ను మహిళా పోలింగ్ బూత్, మల్లంపేట పోలింగ్ బూత్‌ను ఆదర్శ పోలింగ్ బూత్‌గా ఏర్పాటు చేశారు.

**మందమర్రి మండలంలో..**

మందమర్రి, నవంబర్ 29: మండల పరిధిలో మందమర్రి, క్యాతనపల్లి రెండు మున్సిపాలిటీలతో పాటు పది గ్రామ పంచాయతీలున్నాయి, మొత్తం 77205 మంది ఓటర్లున్నారు. అందులో 38586 మంది పురుష ఓటర్లుండగా 38614 మంది మహిళా ఓటర్లు ఐదుగురు ట్రాన్స్‌జెండర్లున్నారు. మహిళలచే నిర్వహించే పోలింగ్ కేంద్రం, ఆదర్శ పోలింగ్ కేంద్రం, దివ్యాంగుల కోసం కార్మెల్ పాఠశాలలో ప్రత్యేక పోలింగ్ కేంద్రం కలుపుకుని మొత్తం 90 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం వరకు సిబ్బంది ఈవీఎం మిషన్‌లతో పాటు సామాగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఎన్నికలు సజావుగా పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు మందమర్రి సీఐ గట్ల మహేందర్ రెడ్డి, పట్టణ ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు. జైపూర్ ఏసీపీ మోహన్ పర్యవేక్షణలో 200 మంది పోలీసు సిబ్బందితో భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని పోలింగ్ కేంద్రానికి మద్యం తాగి రావద్దని, మద్యం తాగిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు హెచ్చరించారు. పోటీలో ఉన్న అభ్యరులు ఒక వ్యక్తిని మాత్రమే వెంట తీసుకు రావాలని అంతకంటే ఎక్కువ మంది వస్తే కేంద్రంలోకి అనుమతించమని వారు అన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.



కోటపల్లి మండలం మల్లంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం



మందమర్రిలో పోలింగ్ కేంద్రానికి వస్తున్న సిబ్బంది

# అభివృద్ధిలో అగ్రపథాన చెన్నూర్

- ఐదేళ్లలో రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులు

చెన్నూర్, నవంబర్ 28: చెన్నూర్ నియోజకవర్గంలో ఐదేళ్లలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్ ఆధ్వర్యంలో వేల కోట్లతో పలు అభివృద్ధి పనులు జరిగాయి. నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగు నీరు అందించే చెన్నూర్ ఎత్తిపోతల పథకానికి రూ.1658 కోట్ల నిధులు మంజూరు.

ఆయిల్ పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి రూ. 500 కోట్ల మంజూరు. చెన్నూర్ పట్టణంలో రూ 10 కోట్లతో 50పడకల నూతన దవాఖాన భవన నిర్మాణం. 100 పడకల దవాఖానకు రూ 40 కోట్ల నిధులు మంజూరు కావడంతో పనులు శరవేగంగా సాగుతున్నాయి. చెన్నూర్‌లో బస్సు డిపో ఏర్పాటుకు నాలుగు ఎకరా స్థలం కేటాయించటంతో రూ 4కోట్ల మంజూరు కావడంతో పనులు శరవేంగా సాగుతున్నాయి.

**చెన్నూర్ మున్సిపాలిటీలో......**

రూ 25 కోట్లతో జలాల్ పెట్రోల్ బంక్ నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు పెద్ద చెరువు నుంచి బుద్ధారం రోడ్డు వరకు ప్రారంభించిన బైపాస్ రోడ్డు నిర్మాణం.

రూ. 25కోట్లతో పట్టణంలోని జలాల్ పెట్రోల్ బంక్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు ప్రధాన రహదారి విస్తరణ, డివైడర్, సెంట్రల్ లైటింగ్, కూడళ్ల సుందరీకరణ. పట్టణంలో రూ.17.52 కోట్లతో 99.49 కిలోమీటర్ల పైపులైన్ వేసి 7629 గృహాలకు త్రాగునీరు అందిస్తున్నారు. రూ 7.20 కోట్లతో ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం. రూ 7కోట్లతో పెద్ద చెరువు, కుమ్మరి కుంట మినీ ట్యాంక్ బండ్ల నిర్మాణం. రూ.5కోట్లతో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నిర్మిస్తున్నారు. రూ కోటితో గ్రంథాలయానికి నూతన భవన నిర్మాణం. రూ 2.50కోట్లతో కేసీఆర్ పార్క్ నిర్మాణం. రూ కోటి రూపాయలతో నిర్మిస్తున్న 33/11కేవీ సబ్ స్టేషన్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి.

రూ 40లక్షలతో రెండు ఓపెన్ జిమ్స్ ఏర్పాటు. రూ 1.50కోట్లతో డంపింగ్ యార్డ్ ప్రారంభం. రూ 1.50కోట్లతో నిర్మిస్తున్న సమ్మక్క-సారలమ్మ మహిళా భవనం పనులు శరవేగంగా సాగుతున్నాయి.

**మందమర్రి మున్సిపాలిటీలో......**

మందమర్రి మున్సిపాలిటీలో రూ162.27 కోట్లతో పలు అభివృద్ధి పనులు, 24 వార్డుల్లో సుమారు రూ 25 కోట్లతో అంతర్గత రోడ్లు, కాలువల నిర్మాణాలు జరుగుతున్నాయి. పట్టణంలో రూ 29.68 కోట్లతో 560 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయి. రూ 2.04కోట్లతో సమ్మక్క – సారలమ్మ మహిళా భవన్ నిర్మాణం. రూ1.35 కోట్లతో 24 బతుకమ్మ గ్రౌండ్లను ఏర్పాటు. తాగునీటి ఇబ్బందులను తొలగిస్తూ రూ.40 కోట్లతో అర్బన్ భగీరథ పథకం. రూ 27.05 కోట్లతో నిర్మిస్తున్న ఆర్‌వోబీ బ్రిడ్జి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి.రూ 7.20 కోట్లతో ఇంటిగ్రేటెడ్ వెజ్ మరియు నాన్ వెజ్ మార్కెట్ పనులు కొనసాగుతున్నాయి.రూ.3 కోట్లతో ఐటీఐ కళాశాల భవన నిర్మాణం. రూ 3.50 కోట్లతో కేసీఆర్ పార్క్ నిర్మాణంలో ఉంది. రూ 5కోట్లతో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నిర్మాణంలో ఉంది. రూ 1.39 కోట్లతో 13 ఓపెన్ జిమ్స్, రూ 1.70 కోట్లతో పార్కులను నిర్మిస్తున్నారు.

**క్యాతనపల్లి మున్సిపాలిటీ.....**

రూ145.83 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు జరిగాయి.రూ 35 కోట్లతో క్యాతనపల్లిలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు శరవేగంగా సాగుతున్నాయి.

రూ 7.20కోట్లతో వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ పనులు శరవేగంతో కొనసాగుతున్నాయి. రూ 15.15 కోట్లతో 286 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం దాదాపుగా పూర్తి కావచ్చింది. రూ 22కోట్లతో మిషన్ భగీరథ పథకం ద్వారా 171 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ వేసి 11,328 గృహాలకు నల్లా ద్వారా నీళ్లు అందిస్తున్నారు. రూ 20 కోట్ల పైచిలుకు నిధులతో అంతర్గత రోడ్లు, కాలువలు నిర్మాణ పనులు పూర్తి. రూ 1.70కోట్లతో పట్టణం మొత్తం విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. రూ 1.10కోట్లతో 22 బతుకమ్మ గ్రౌండ్స్ నిర్మాణం. ఇక నియోజకవర్గంలోని మండలాల్లో ముఖ్యమైన అభివృద్ధి పనులు. రూ 15కోట్లతో సుద్దాల వాగుపై బ్రిడ్జి నిర్మాణం. రూ 8 కోట్ల రూపాయలతో కోటపల్లి మండలంలోని తుంతుంగ వాగుపై బ్రిడ్జి నిర్మాణం. కిష్టంపేట వద్ద ఇరుకైన వంతెన స్థానంలో 3.50 కోట్ల నూతన వంతెన నిర్మాణం.



చెన్నూర్‌లో ప్రభుత్వ దవాఖాన

రూ 4.80కోట్లతో చెన్నూర్ మండలంలోని సుబ్బరాంపల్లి వాగుపై బ్రిడ్జ్ నిర్మాణం. గంగారం వద్ద రూ1.97 కోట్లతో వాగుపై వంతెన నిర్మాణం. రూ 3.86 కోట్లతో బొక్కల గుట్ట వద్ద వంతెన నిర్మాణం. బాల్క ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు.

## వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశా..

తాను గతంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో చెన్నూర్ నియోజకవర్గంలో రూ వేల కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టాను. గత నాయకులు ఈ ప్రాంతాన్ని పట్టించుకోలేదు. చెన్నూర్‌లో రూ 10కోట్లతో 50పడకల దవాఖానను నిర్మించాను. వంద పడకల దవాఖాన నిర్మాణానికి రూ 40కోట్ల నిధులు మంజూరు కావడంతో పనులు శరవేగంగా సాగుతున్నాయి. బస్ డిపో కోసం 4ఎకరాల స్థలాన్ని కేటాయించి, రూ 4 కోట్లు మంజూరు చేయించాను, త్వరలో బస్సు డిపో ప్రారంభం కానుంది. లక్ష ఎకరాలకు సాగు నీరు అందించేందకు చెన్నూర్ ఎత్తి పోతల పథకానికి రూ 1658కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. మందమర్రిలో రూ 500కోట్లతో ఆయిల్ ఫాం ఫ్యాక్టరీని నిర్మిస్తున్నాము. ఒక్కో మున్సిపాలిటీకి రూ వంద కోట్ల చొప్పున పలు అభివృద్ధి పనులు చేపట్టాం. పలు వాగులపై వంతెనలు నిర్మించామని, గోదావరి వరదల నివారణకు కరకట్టల నిర్మాణానికి కృషి చేస్తున్నామని తెలిపారు. తాను చేసిన అభివృద్ధి పనులు ప్రజలకు కండ్ల ముందే ఉన్నాయి. నియోజకవర్గంలో ఈ అభివృద్ధి యజ్ఞం ఇలానే కొనసాలంటే తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.

**-బాల్క సుమన్ (బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి)**

## బాల్క సుమన్ గెలవాలని పూజలు..



మైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మందమర్రి, నవంబర్ 29: బీఆర్ఎస్ చెన్నూర్ నియోజక వర్గం అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ గెలుపు కోసం మందమర్రి మండల పరిధిలోని బొక్కలగుట్ట గ్రామం సమీపంలో గల గాంధారీ మైసమ్మ ఆలయంలో బుధవారం బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విప్ సుమన్ గెలుపును ఆకాంక్షిస్తూ ముడుపులు కట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విప్ బాల్క సుమన్‌ను భారీ మెజారిటీతో రెండవ సారి ఎమ్మెల్యేగా గెలిపించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జక్కుల సమ్మయ్య, గాండ్ల నారాయణ, సంతోశ్ పాండే, గోలేటి సురేందర్, చిలుక శేఖర్, రాజేశ్, సురేశ్, సెగ్యం రవి కుమార్, వేముగంటి శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో డబ్బుల పంచాయితీ..!

భీమారం, నవంబర్ 29 : కాంగ్రెస్ లో డబ్బుల పంచాయితీ ముదిరింది. దీంతో గొడవకు దారి తీసింది. మండల వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెల్కొనగా పోలంపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం ఇటీవల ఓ పార్టీ నుంచి కాంగ్రెస్‌కు వచ్చిన నాయకుడికి ప్రచారం కోసం రూ. 60 వేలు ఇచ్చామని, కానీ అతని వద్దే ఉంచుకున్నాడని కాంగ్రెస్ పార్టీ నాయకులు వాగ్వాదానికి దిగారు. దీంతో ఆ గ్రామంలో ఘర్షణ వాతావరణం నెలకొన్నది. ఎన్నో తాము పార్టీలో పని చేస్తున్నప్పటికీ ఇటీవల ఓ పార్టీ నుంచి నాయకుడికి డబ్బులు ఎలా అప్పగిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు.

## విద్యుత్ షాక్‌తో వృద్ధురాలి మృతి

మందమర్రి, నవంబర్ 29: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని అంగడి బజార్‌ఏరియా చెందిన కొక్కెర మల్లమ్మ విద్యుత్ షాక్‌గురై మృతి చెందింది. బుధవారం వాటర్ హీటర్ పెట్టే క్రమంలో విద్యుత్ షాక్ తగిలి మల్లమ్మ మృతి చెందిందని బంధువులు తెలిపారు. మల్లమ్మకు భర్త, ఇద్దరు బిడ్డలు, ఒక కొడుకు ఉన్నారు.